నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
08-07-2025
పేజీలు: 02




## సవాళ్లు విసిరి.. పారిపోవడం
# రేవంత్‌కు కొత్త కాదు!

### ముఖ్యమంత్రి తరపున ఎవరు వచ్చినా.. మేము చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం!

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ఈ ప్రభుత్వాన్ని 18 నెలలుగా నిలదీస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. "అభివృద్ధిపై చర్చకు రావాలని సీఎం రేవంత్రెడ్డిని ఎన్నో సార్లు ఆహ్వానించాం. అసెంబ్లీలో కాదంటే.. ప్రెసక్లబ్లోనైనా చర్చకు రావాలని చెప్పా. రుణమాఫీ, రైతు బోనస్ వంటి అంశాలపై చర్చకు రావాలని ఆహ్వానించా. సీఎం రేవంత్రెడ్డి ఢిల్లీలో ఉన్నారని తెలిసింది... సీఎం రాకుంటే మంత్రులైనా రావాలి. సీఎం ఇవాళ హాజరుకాకుంటే మరో రోజు చర్చకైనా మేం సిద్ధం. సీఎం రేవంత్రెడ్డికి వీలైన తేదీ, ప్రదేశం చెప్పాలని అడుగుతున్నాం. అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా మాట్లాడిస్తామని హామీ ఇస్తే.. అసెంబ్లీలో కూడా సిద్ధం. ఈ ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. రేవంత్రెడ్డి తప్పకొంటే.. అభివృద్ధి అంటే ఏంటో కేసీఆర్ చేసి చూపిస్తారు" అని కేటీఆర్ అన్నారు. మీడియాతో మాట్లాడిన తర్వాత పార్టీ నేతలతో కలిసి సోమాజీగూడ ప్రెసక్లబ్కు బయల్దేరారు.



## కీరవాణి తండ్రి కన్నుమూత

తెలుగు సినీ ఇండస్ట్రీలో మరో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విన్నర్ కీరవాణి తండ్రి శివ శక్తి దత్తా కొద్ది సేపటి క్రితం కన్నుమూసారు. వయోభారం కారణంగా ఆయన మృతి చెందినట్టు తెలుస్తుంది. శివ శక్తి దత్తా గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. రచనలకే కాకుండా ఆయనకు చిత్రలేఖనంలో కూడా అసాధారణ ప్రతిభ ఉంది. ఆ మధ్య శివ శక్తి దత్తా ప్రతిభను చూసిన బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ మంత్ర ముగ్దుడయ్యారు. 92 ఏళ్ల వయసు లోనూ శివ శక్తి దత్తా ఆర్ట్ అద్భుతంగా గీసారు. స్వయంగా గీసిన దేవుళ్ల చిత్రపటాలు, శివాజీ మహారాజ్ బొమ్మతో ఆయన నివాసం ఓ దేవాలయంలా కనిపిస్తోంది. ఈ దృశ్యాలను అనుపమ్ ఖేర్ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి వైరల్ అయ్యాయి.

సై (నల్లా నల్లాని కళ్ల పిల్ల)
ఛత్రపతి (మన్నేల తింటివిరా)
బాహుబలి (మమతల తల్లి, ధీవర)
బాహుబలి 2 (సాహోరే బాహుబలి)
ఆర్ఆర్ఆర్ (రామం రాఘవమ్)
హనుమాన్ (అంజనాద్రి థీమ్ సాంగ్) లాంటి సూపర్ హిట్ పాటలు రాశారు.



## ఇడుపులపాయలో వైఎస్ఆర్ ఘాట్ వద్ద
# వైఎస్ జగన్ నివాళి

దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి నేడు. ఈ సందర్భంగా వైఎస్సార్ తనయుడు, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఆ సమయంలో ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో విజయమ్మ, వైఎస్ భారతి, ఇతర కుటుంబ సభ్యులు, వైఎస్సార్సీపీ నేతలు, పెద్దఎత్తున అభిమానులు పాల్గొన్నారు. వైఎస్ జగన్ రాకతో ఇడుపులపాయ కోలాహలంగా మారింది. జననేతను చూసేందుకు, కరచలనం చేసేందుకు, ఫొటోలు దిగేందుకు భారీ ఎత్తున అభిమానులు ఘాట్ వద్దకు పోటెత్తారు.

**మిస్ యూ డాడ్..**

వైఎస్సార్ జయంతిని ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. మిస్ యూ డాడ్ అంటూ ఎక్స్ ఖాతాలో ఇవాళ ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించిన ఫొటోలను పంచుకున్నారు.

**ఆందోళన వద్దు.. అండగా ఉంటాం**

కడపలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు వైఎస్ జగన్ మోహన్రెడ్డిని కలిశారు. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అనుమతి లేకపోవడం, ADCET విడుదలపై వారం రోజులుగా స్టూడెంట్స్ ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇడుపులపాయలో వైఎస్ జగన్ను వాళ్లు కలిసి తమ సమస్యలను చెప్పకున్నారు. సమస్య పరిష్కారానికి తాను కృషి చేస్తానని వైఎస్ జగన్ అన్నారు. "విద్యార్థులకు మంచి యూనివర్సిటీ కడితే ఈ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేస్తోంది. వైఎస్సార్సీపీ విద్యార్థులకు అన్ని విధాల అండగా ఉంటుంది వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.



## మరింత తగ్గిన బంగారం ధరలు

ఆల్‌టైమ్ గరిష్టానికి చేరిన బంగారం, వెండి ధరలు ప్రస్తుతం దిగి వస్తున్నాయి. గత వారం లక్ష రూపాయలను దాటేసిన బంగారం ప్రస్తుతం 98 వేలకు దిగి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జులై 8న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 98, 280కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 90, 100కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే 24 క్యారెట్ల బంగారం ధరం రూ.600 మేర, 22 క్యారెట్ల బంగారం ధర రూ.500 మేర తగ్గింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 98, 430కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 90, 240కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 98, 280కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 90, 100కి చేరింది. వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి.

# టీడీపీ vs వైసీపీ



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మధురమైన పంట ఇప్పుడు రాజకీయాలను ఘాటుగా మార్చింది. సీఎం సొంత జిల్లాలో టీడీపీ, వైసీపీ మధ్య పొలిటికల్ వార్ సృష్టించింది. ఈ ఏడాది విస్తారంగా సాగుచేసిన మామిడి.. దిగుబడిలోనూ అదే దూకుడు ప్రదర్శించడంతో మామిడి రైతుకు గిట్టుబాటు ధర సమస్యగా మారింది. జిల్లాలోని మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్న పరిస్థితికి కారణం అయ్యింది. పల్ప్ పరిశ్రమలు వద్ద బారులు తీరుతున్న మామిడి ట్రాక్టర్లు రైతు కష్టాన్ని వెలుగెత్తి చాటడంతో రాజకీయ పార్టీల మధ్య రచ్చ మొదలైంది. ప్రధానంగా టిడిపి, వైసిపి మధ్య మాటల యుద్ధంకు కారణం అయ్యింది. మామిడి రైతును ఆదుకోవడంలో, గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందంటూ వైసిపి రోడ్డు ఎక్కడంతో సమస్య పొలిటికల్ ఇష్యూగా మారింది. జిల్లాలో మామిడి రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఒకవైపు ప్రయత్నిస్తుండగానే మరోవైపు రాజకీయ విమర్శలు జిల్లాలో మ్యాంగో ఫైట్ కు కారణం అయ్యాయి. తోతాపురి మామిడిని కొనుగోలు చేసే పల్ప్ పరిశ్రమల నుంచి టన్ను కు రూ.8 వేలు, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకంగా టన్నుకు రూ.4 వేలు చెల్లించేలా ప్రభుత్వం చొరవ చూపింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం శ్రమిస్తోంది. గత 3 వారాలుగా ఇదే పనిలో జిల్లా అధికారులు ఉండగా మరోవైపు సీఎం కూడా మామిడి రైతుల సమస్యలపై ఆరా తీశారు. ఈ మేరకు కుప్పంలో మామిడి రైతులు, అధికారులు, గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలోనే మామిడి సేకరణకు నిధులు ఇవ్వాలంటూ కేంద్రానికి సీఎం లేఖ రాయడం, చిత్తూరు తిరుపతి అన్నమయ్య జిల్లాల కలెక్టరేట్‌లలో కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేసి మామిడి కొనుగోళ్లపై రోజువారి సమీక్షలు చేయాలని ఆదేశించడం లాంటి చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.



## 'ఖాకీ' దర్శకునితో ధనుష్ నెక్స్ట్!




తెలుగు, తమిళ్ ఇంకా హిందీ భాషల్లో ఫుల్ బిజీగా ఉన్న వన్ అండ్ ఓన్లీ హీరో ఎవరైనా ఉన్నారు అంటే అది కోలీవుడ్ వెర్సటైల్ స్టార్ ధనుష్ అనే చెప్పొచ్చు. రీసెంట్ గానే తాను తెలుగులో చేసిన కుబేర సూపర్ హిట్ అయ్యి మంచి వసూళ్లు సాధిస్తుంది. దర్శకుడు శేఖర్ కమ్ములతో చేసిన ఈ సినిమా తర్వాత మరిన్ని సినిమాలు ధనుష్ లైనప్ లో ఉన్నాయి. అయితే లేటెస్ట్ గా మరో సాలిడ్ దర్శకుడు తన లైనప్ లో కన్ఫర్మ్ అయ్యాడు. మరి ఆ దర్శకుడు ఎవరో కాదు కార్తీతో 'ఖాకీ', అజిత్ తో భారీ యాక్షన్ చిత్రాలు వలిమై, తెగింపు, ఇప్పుడు దళపతి విజయ్ తో జన నాయకుడు లాంటి సినిమాలు చేస్తున్న దర్శకుడు హెచ్ వినోద్. తాను ధనుష్ కి రీసెంట్ గానే కథచెప్పగా ధనుష్ దాన్ని ఓకే చేసాడట. ఇక ఈ సినిమాకి సామ్ సి ఎస్ సంగీతం అందించడం కూడా కన్ఫర్మ్ అయ్యింది. ఈ చిత్రమైతే విజయ్ తో సినిమా పూర్తయిన వెంటనే మొదలవుతుంది అని తెలుస్తుంది.



## ఆర్చర్ దింపుతున్న ఇంగ్లండ్

టీమిండియాను చూసి వణుకుతోంది ఇంగ్లండ్ జట్టు. పెట్టని కోటగా ఉన్న ఎడ్జ్‌బాస్టన్‌లో 336 పరుగుల భారీ తేడాతో ఓటమి ఎదురవడంతో స్టోక్స్ సేనకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. ఇలా అన్ని విభాగాల్లోనూ గిల్ సేన ఫుల్ డామినేషన్ చూపించడంతో ఇంగ్లీష్ టీమ్‌కు దిక్కు తోచడం లేదు. లార్డ్స్ టెస్ట్‌లో కమ్‌బ్యాక్ ఇవ్వాలని చూస్తోంది. జోరు మీదున్న టీమిండియాను అడ్డుకునేందుకు ఏకంగా ఓ పేస్ రాక్షసుడ్ని దింపుతోంది. ఈ విషయాన్ని స్వయంగా ఇంగ్లండ్ హెడ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ కన్ఫర్మ్ చేశాడు.జులై 10 నుంచి జరిగే లార్డ్స్ టెస్ట్‌లో ఆడేందుకు జోఫ్రా ఆర్చర్ సంసిద్ధంగా ఉన్నాడని మెకల్లమ్ తెలిపాడు. ఆ మ్యాచ్‌లో అతడు అద్భుతంగా రాణిస్తాడనే నమ్మకం తమకు ఉందన్నాడు. ఆర్చర్ వికెట్లు తీయాలనే ఆకలితో ఉన్నాడని చెప్పాడు. 'ఆర్చర్ బరిలోకి దిగేందుకు రెడీగా ఉన్నాడు. అతడు వికెట్లు పడగొట్టాలనే కసితో ఉన్నాడు. గాయాల వల్ల సుదీర్ఘ ఫార్మాట్‌కు చాన్నాళ్లుగా దూరంగా ఉన్నాడు. కానీ అతడేం చేయగలడో నేను కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. అవకాశం ఇస్తే అతడు ఒక రేంజ్‌లో చెలరేగుతాడు. ఇప్పటికే తానేం చేశాడో అతడికి కూడా తెలుసు. దానికి తోడు కొత్తగా పలు విషయాలను బౌలింగ్‌లో చేర్చుకున్నాడు. కాబట్టి ఆర్చర్ విశ్వరూపం చూపించడం ఖాయం' అని మెకల్లమ్ చెప్పుకొచ్చాడు.



## 'రాజాసాబ్' కోసం
# తమన్నా?

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'ది రాజాసాబ్' ఇప్పటికే ఎలాంటి అంచనాలు క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు మారుతి డైరెక్ట్ చేస్తుండగా ఈ చిత్రాన్ని హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ చిత్రంపై అంచనాలు రెట్టింపు చేశాయి.అయితే, ఈ సినిమా నుంచి ఇప్పుడొక ఇంట్రెస్టింగ్ వార్త సినీ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉండనుందని.. దీని కోసం పలువురు హీరోయిన్ల పేర్లు చిత్ర యూనిట్ పరిశీలిస్తున్న సంగతి తెలిసిందే. కాగా, ఇప్పుడు ఈ సాంగ్ కోసం మిల్కీ బ్యూటీ తమన్నాను ఓకే చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

## రూరల్ యాక్షన్ డ్రామా
# మారెమ్మ


రవితేజ సోదరుడైన రఘు కుమారుడు మాధవ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'మారెమ్మ'. మంచాల నాగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మోక్ష ఆర్ట్స్ పతాకంపై మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. సోమవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో మాధవ్ రగ్గ్‌డ్ లుక్‌లో కనిపించారు. ఎలాంటి సవాలునైనా ఎదుర్కోవడానికి సిద్ధమన్నట్లు ఆయన లుక్ పవర్‌ఫుల్‌గా అనిపిస్తున్నది. 'గ్రామీణ నేపథ్యంలో యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం.



## భూమి దగ్గర నుంచి దూసుకెళ్లిన ఆస్టరాయిడ్

భారీ గ్రహశకలం భూమికి దగ్గర నుంచి దూసుకెళ్లింది. సోమవారం మధ్యాహ్నం 3.16 గంటల సమయంలో ఆస్టరాయిడ్ 2025 ఎన్‌జే భూమికక్షకు చాలా దగ్గరగా వెళ్లిందని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా తెలిపింది. దాదాపు 85 అడుగుల వెడెల్పుతో ఉన్న ఈ ఆస్టరాయిడ్ గంటకు 48,800 కిలోమీటర్ల వేగంతో భూమి కక్ష్య నుంచి దాదాపు 22.4 లక్షల కిలోమీటర్ల దూరంలో నుంచి వెళ్లిందని పేర్కొంది. ఫుట్‌బాల్ మైదానం పరిమాణంలో ఉన్న ఈ ఖగోళ వస్తువు భూమిని ఢీకొట్టేందుకు అవకాశం లేదు. అయినా దాని పరిమాణం, వేగాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రమాదకరమైన కేటగిరిలో చేర్చింది. ఈ ఆస్టరాయిడ్ అపోలో తరగతికి చెందిన భూమికి సమీపంలో ఉన్న వస్తువుల్లో ఒకటి.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్.. వింబుల్డన్‌లో క్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. సోమవారం సెంటర్ కోర్ట్ వేదికగా జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఆరో సీడ్ జొకో.. 1-6, 6-4, 6-4, 6-4తో ఆస్ట్రేలియా ఆటగాడు అలెక్స్ డి మినార్‌ను చిత్తుచేశాడు. వింబుల్డన్‌లో క్వార్టర్స్ చేరడం జొకోకు ఇది ఏకంగా 16వ సారి కావడం విశేషం.తొలి సెట్ ఓడినప్పటికీ తర్వాత పుంజుకునే అలవాటున్న జొకో.. అదే తీరును కొనసాగిస్తూ ఆస్ట్రేలియా ఆటగాడిపై ఆధిపత్యం చెలాయించాడు. క్వార్టర్స్‌లో అతడు ఇటలీ కుర్రాడు, 22వ సీడ్ ఫ్లావియోతో తలపడనున్నాడు. ఇక జొకో ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌ను వీక్షించేందుకు గాను స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ హాజరవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వింబుల్డన్‌లో భారత్ పోరు ముగిసింది. ఈ టోర్నీ బరిలో ఉన్న ఏకైక ఆటగాడు యుకీ బాంబ్రీ.. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ ఓడి ఇంటిబాట పట్టాడు.

## 16వ సారి వింబుల్డన్ క్వార్టర్స్‌కు అర్హత

## ఏసీబీ వలలో డిప్యూటీ తహశీల్దార్

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నా కొందరు ఉద్యోగుల తీరు మారడం లేదు. తాజాగా నల్గొండ జిల్లాలో ఓ అవినీతి డిప్యూటీ తహసీల్దార్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. సీజ్ చేసిన వాహనాలను విడుదల చేసేందుకు రూ.70,000 లంచం డిమాండ్ చేసిన కేసులో జిల్లా పౌర సరఫరాల శాఖకు చెందిన డిప్యూటీ తహశీల్దార్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ డివిజన్ పౌర సరఫరాల శాఖలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న షేక్ జావీద్, అధికారులు స్వాధీనం చేసుకున్న మూడు వాహనాల విడుదలకు ఓ వ్యక్తిని లంచం డిమాండ్ చేశాడు. వాహనాలకు పంచనామా నిర్వహించి, కోర్టు నుంచి విడుదల ఉత్తర్వులు ఇప్పించేందుకు గాను తొలుత రూ.1,00,000 కావాలని అడిగాడు. ఆ తర్వాత బేరసారాలతో రూ.70,000 ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది.అయితే, లంచం ఇవ్వడానికి ఇష్టపడని బాధితుడు నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అతని ఫిర్యాదు ఆధారంగా జూన్ 7న కేసు నమోదు చేసుకున్న ఏసీబీ అధికారులు, విచారణ జరిపి డిప్యూటీ తహశీల్దార్ షేక్ జావీద్‌ను అరెస్ట్ చేశారు.



## స్కూల్ వ్యాన్‌ను ఢీకొట్టిన రైలు..

### ముగ్గురు చిన్నారు మృతి, 12 మందికి తీవ్రగాయాలు

తమిళనాడులోని కడలూరులో ఘోర ప్రమాదం జరిగింది. విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ వ్యాను కడలూరు జిల్లా సెమ్మంగుప్పం వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. దీంతో ముగ్గురు చిన్నారులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో 12 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్థానికుల సహాయంతో గాయపడిన చిన్నారులను పోలీసులు దవాఖానకు తరలించారు. ఘటనా స్థలంలో ప్రస్తుతం సహాక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నది. రైలు వచ్చే సమయంలో గేటు వేయకపోవడంతో ప్రమాదం చోటుచేసుకున్నది. తమిళనాడులోని కడలూరులో ఈ ఘోర ప్రమాదం జరిగింది. చెమ్మగుంపం వద్ద స్కూల్ వ్యాన్ రైల్వే గేట్ క్రాస్ అవుతుండగా.. వేగంగా వచ్చిన ట్రైన్ ఢీకొట్టింది. దీంతో బస్సు ఎగిరి 10మీటర్ల దూరంలో పడింది. ఈ ఘటనలో అక్కడికక్కడే ఇద్దరు విద్యార్థులు మరణించగా.. పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో నలుగురు విద్యార్థులతో పాటు, డ్రైవర్, అసిస్టెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. సాయంత్రం స్కూల్ నుంచి తిరిగి వస్తారనుకున్న బిడ్డలు విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. రైలు వచ్చే సమయంలో గేట్ వేయకపోవడంతోనే ఈ పెను ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం ధాటికి వ్యాన్ మొత్తం నుజ్జునుజ్జు అయ్యింది.



# తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఋతుపవనాలకు తోడు, అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాల్లో నిన్న మోస్తరు వర్షం కురిసింది. ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నేడు ఈ జిల్లాలలో భారీ వర్షాలు ఇక గోదావరి పరివాహక ప్రాంతాలైన ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. నేడు కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రేపు ఈ జిల్లాలలో అతి భారీ వర్షాలు రేపు నిజామాబాద్, ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. ఉరుములు మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సూచిస్తుంది. నిండు కుండల్లా జలాశయాలు ఇదిలా ఉంటే ఇప్పటికే కృష్ణ పరివాహక ప్రాంతాలలో ఎగువన కురుస్తున్న వర్షాలతో ఆయా ప్రాంతాలలోని ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక శ్రీశైలం జలాశయం కూడా నిండుకుండలా మారింది. ప్రస్తుతం శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త స్టాంప్ డ్యూటీ బిల్లు.. మహిళలకు స్పెషల్ రాయితీ! నాగార్జున సాగర్ లో పెరుగుతున్న నీటి మట్టం మరోవైపు నాగార్జునసాగర్ కు కూడా వరద నీరు వస్తుండడంతో నీటిమట్టం పెరుగుతుంది. ఇక వర్షాల కోసం ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతలు వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలతో వరుణ దేవుడి కరుణ కోసం నిరీక్షిస్తున్నారు. మొత్తంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో వర్షాలు కురుస్తున్నాయి. అయితే ఇప్పటివరకు ఆశించిన దానికంటే చాలా చోట్ల తక్కువ వర్షపాతం నమోదు అయినట్టుగా వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.



## పెళ్లికి ఒప్పుకోలేదని ప్రియురాలి గొంతుకోసి చంపిన ప్రియుడు

### అనంతరం తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డయువకుడు

విజయనగరం జిల్లా బొబ్బిలి గ్రామంనుండి 25 ఏళ్ల క్రితం వచ్చి, సంగారెడ్డి జిల్లా బండ్లగూడలో నివసిస్తున్న బొత్స శ్రీనివాస రావు, ఈశ్వరమ్మ దంపతులు. చందానగర్ లోని ప్రగతి కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వారి కూతురు రమ్య(23). గత మూడేళ్లుగా మెదక్ జిల్లా మన్నేపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే వ్యక్తితో ప్రేమలో ఉన్న రమ్య. సోమవారం రమ్య ఇంట్లో ఎవరూ లేరని గ్రహించి, తన ఇంటికి వెళ్లి పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేసిన ప్రవీణ్. చదువు పూర్తయ్యాకే పెళ్లి గురించి ఆలోచిద్దామని చెప్పడంతో, ముందుగానే తనతో తెచ్చుకున్న కత్తితో రమ్య గొంతు కోసి కిరాతకంగా హత్య చేసి, తానూ ఆత్మహత్యాయత్నం చేసిన ప్రవీణ్. అదేసమయంలో ఇంటికొచ్చిన తల్లిదండ్రులు రక్తపు మడుగుల్లో ఉన్న వారిద్దరిని గమనించగా, అప్పటికే మరణించిన రమ్య. కొన ఊపిరితో ఉన్న ప్రవీణ్ ను ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు. అయితే 6 నెలల క్రితం రమ్యను తనకిచ్చి పెళ్లి చేయాలని ప్రవీణ్ కోరగా, అందుకు నిరాకరించి రమ్యకు వేరే సంబంధాలు చూస్తున్న తల్లిదండ్రులు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ప్రవీణ్, ఈ దుర్మార్గానికి పాల్పడి ఉంటాడని తెలిపిన పోలీసులు.



## సిగాచి ఇండస్ట్రీస్‌లో పేలుడు.. 44కు చేరిన మృతులు

పాశమైలారం సిగాచి ఇండస్ట్రీస్ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. వారం రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బీరంగూడ పనేషియా దవాఖానలో చికిత్స పొందుతున్న అఖిలేష్ అనే కార్మికుడు మంగళవారం ఉదయం మరణించారు. దీంతో మృతుల సంఖ్య 44కు చేరింది. మరోవైపు ధృవ హాస్పిటల్‌లో ఇప్పటివరకు నలుగురు కార్మికులు చనిపోయారు. కాగా, వివిధ దవాఖానల్లో 16 మంది కార్మికులు చికిత్స పొందుతున్నారు. మరో 8 మంది కార్మికుల జాడ ఇంకా తేలలేదు.

**కాసేపట్లో సిగాచి పరిశ్రమకు NDMA బృందం**

పాశమైలారం సిగాచి ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిన ఘటన 42 కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. ఘటన జరిగి 9 రోజులు గడుస్తున్నా.. ఇంకా 8 మంది కార్మికుల ఆచూకీ తెలియరాలేదు. అయితే ఈ ఘటనను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ప్రమాదం జరిగిన స్పాట్‌కు వెంటనే వెళ్లాలంటూ నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కాసేపట్లో ఎన్‌డీఎంఏ బృందం పాశమైలారంకు చేరుకోనుంది.

## వివాహిత స్నానం చేస్తుండగా వీడియో.. ప్రశ్నించిన భర్తపై దాడి

విజయనగరానికి చెందిన ఓ వివాహిత స్నానం చేస్తుండగా ఓ యువకుడు వీడియో తీశాడు. ప్రశ్నించిన ఆమె భర్తపై దాడి చేసిన నిందితుడ్ని ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించారు. బాధితురాలు ఈనెల 4న స్నానం చేస్తున్న సమయంలో పి.శంకర్ అనే వ్యక్తి వీడియో తీశాడు. గమనించిన ఆమె కేకలు వేయగా పరారయ్యాడు. విషయం తెలిసిన భర్త శంకర్‌ను నిలదీసి, ఫోన్ తీసుకున్నాడు. ఈక్రమంలో అతడిపై దాడికి పాల్పడి, ఫోన్‌తో శంకర్ పారిపోయాడు.



## హాట్ మీనాక్షి

మీనాక్షి చౌదరీ.. ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో మారుమోగుతున్న పేరు. ఈ ఏడాది వరుసగా హిట్స్ అందుకుంటూ ఫుల్ జోష్ మీదున్న ఈ అమ్మడు.. ఇప్పుడు చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. అలాగే ఇటు సోషల్ మీడియాలోనూ వరుస ఫోటోషూట్స్ చేస్తూ తెగ సందడి చేస్తుంది. తాజాగా చీరకట్టులో మెస్మరైజ్ చేస్తుంది.ఈ ఏడాది ప్రారంభంలోనే సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో సూపర్ హిట్ అందుకుంది మీనాక్షి చౌదరి. గతేడాది సైతం లక్కీ భాస్కర్ సినిమాతో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. నటనకు ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ.ఇక ఇప్పుడు ఈ అమ్మడు తన సినిమాల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆమె చేస్తున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద హిట్టవ్వడం ఖాయమని టాక్. ఇక ఇప్పుడు తెలుగుతోపాటు తమిళంలోనూ ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్స్ వస్తున్నాయి. మరోవైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది.తాజాగా ఈ అమ్మడు నెట్టింట గ్లామర్ ఫోటోష్ షేర్ చేస్తూ అభిమానులకు షాకిస్తుంది. ఇటీవల వైట్ డ్రెస్ లో గ్లామర్ లుక్స్ తో నెట్టింట అరాచకం సృష్టించిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు ఆకుపచ్చ చీరకట్టులో మెస్మరైజ్ చేస్తుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన అందమైన ఫోటోస్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి.